



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02
4PM

| | |
|---|---|
| బంగారం ధర 10 GRMS 24 CARAT | ₹62,840 |
| వెండి ధర 1KG | 76,400 |
| సెన్సెక్స్ (↓190) | 72,952 |
| నిఫ్టి (↓42) | 22,170 |
| చికెన్ ధర 1KG | ₹ 280 |
| గుడ్ల ధరలు డజన్ | ₹68 |




## ఢిల్లీ మెట్రోలో గోల్డెన్ లైన్.. 15 స్టేషన్లు, 24 కి.మీ. జర్నీ!

ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్సీ) తాజాగా మెట్రో ఫేజ్ 4 ప్రాజెక్ట్‌లోని తుగ్లకాబాద్ నుండి ఢిల్లీ ఏరోసిటీ కారిడార్ కలర్ కోడ్‌లో చోటుచేసుకున్న మార్పును ప్రకటించింది. ఇంతకుముందు ఈ లైన్‌ను సిల్వర్ లైన్ అని పిలిచేవారు. ఇకపై ఈ రూట్‌ను గోల్డెన్ లైన్ అని పిలవనున్నారు. విజిబిలిటీ సంబంధిత సమస్య కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. మీడియాకు అందిన సమాచారం ప్రకారం మెట్రో కోచ్‌లలో వెండి రంగు స్పష్టంగా కనిపించడం లేదు. అందుకే దీనిని గోల్డెన్ లైన్ కారిడార్‌గా మార్చారు. ఇది 23.62 కిలోమీటర్ల విస్తీర్ణంలో, మొత్తం 15 స్టేషన్లను కలిగి ఉంటుంది. ఈ కారిడార్ పనులు వేగంగా జరుగుతున్నాయి. 2025నాటికి ఇవి పూర్తికావచ్చని అధికారులు చెబుతున్నారు. ఫేజ్-4లో గోల్డెన్ లైన్‌తో పాటు మరో రెండు కారిడార్లు కూడా నిర్మాణంలో ఉన్నాయి. వీటిలో జనక్‌పురి వెస్ట్ నుండి ఆర్‌కే ఆశ్రమం వరకు మెజెంటా లైన్‌ను పొడిగించడం, మజ్లిస్ పార్క్ నుండి మౌజ్‌పూర్ వరకు పింక్ లైన్‌ను పొడిగించడం మొదలైనవి ఉన్నాయి. ఢిల్లీ మెట్రోలోని ఒక్కో కారిడార్‌ను ఒక్కో రంగుతో గుర్తిస్తున్న సంగతి తెలిసిందే. ఎల్లో లైన్ సమయపూర్ బద్లీ నుండి గుర్గావ్ వరకు, బ్లూ లైన్ వైశాలి నుండి ద్వారక వరకు, రెడ్ లైన్ కొత్త బస్టాండ్ నుండి రితాలా వరకు నడుస్తుంది.

## తొమ్మిదో తరగతి బాలికపై పీఈటీ అత్యాచారం

విశాఖ జిల్లాలో సోమవారం దారుణం చోటు చేసుకుంది. తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికపై పీఈటీ మాస్టర్ అత్యాచారం చేశాడు. మధురవాడకు చెందిన మైనర్ బాలిక స్థానిక పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈ క్రమంలో బాలికపై పీఈటీ దుర్గాప్రసాద్ కళ్లు పడ్డాయి. బాలికకు మాయ మాటలు చెప్పి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. బెదిరింపులకు పాల్పడటంతో బాలిక ఆ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. దాంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



## బీహార్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. తొమ్మిది మంది మృతి!

బీహార్‌లోని కైమూర్ జిల్లా మొహానియా పరిధిలోగల దేవ్‌కలి సమీపంలో వేగంగా వస్తున్న వస్తున్న ఒక కారు..బైక్‌ను ఢీకొని, మరో లేన్‌లోకి దూసుకెళ్లి.. ఎదురుగా వస్తున్న ట్రక్కును ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఎనిమిదిమందితో పాటు బైక్ నడుపుతున్న వ్యక్తితో సహా మొత్తం తొమ్మిదిమంది సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనంలో చిక్కుకున్న మృతదేహాలను బయటకు తీసి, పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుల్లో గాయకుడు ఛోటూ పాండే కూడా ఉన్నారు. ఈ ఘటన గురించి మోహానియా డీఎస్పీ దిలీప్ కుమార్ మాట్లాడుతూ స్కార్పియో వాహనం ససారం నుంచి వారణాసి వైపు వెళుతున్నదని, ఆ వాహనంలో ఎనిమిదిమంది ఉన్నారని తెలిపారు. మోహనియా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్‌హెచ్ 2లోని దేవ్‌కలి సమీపంలో, ఆ కారు ఒక బైక్‌ను ఢీకొని, డివైడర్‌ను దాటి.. మరో లేన్‌లోకి ప్రవేశించి, ఎదురుగా వస్తున్న ట్రక్కును ఢీకొన్నదని తెలిపారు.






## కొండెక్కిన చికెన్ ధర

తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు భారీగా పెరిగాయి. గత వారం స్కిన్‌లెస్ చికెన్ కేజీ ధర రూ.200-220 మధ్య పలికింది. ఇవాళ ఆదివారం కావడంతో ఏకంగా రూ.280-300కు చేరింది. బోన్‌లెస్ చికెన్ ధర రూ.450-500కు పెరిగింది. బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్, ఇతర కారణాలతో కోళ్ల సరఫరా తగ్గింది. దాంతో వ్యాపారాలు ధరను భారీగా పెంచేశారు. వేసవిలో ధర మరింత పెరిగే అవకాశం ఉంది. మీ ప్రాంతంలో చికెన్ ధరెంత ఉందో కామెంట్ చేయండి.



## భారీగా డ్రగ్స్ సీజ్.. బీజేపీ నేత కుమారుడు అరెస్ట్!

నగరంలోని గచ్చిబౌలిలో భారీగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. ఈ క్రమంలో డ్రగ్స్‌తో సంబంధం ఉన్న బీజేపీ నేత కుమారుడితో సహా మరో ఇద్దరిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల ప్రకారం.. గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో భారీగా డ్రగ్స్‌ను పట్టుకున్నారు పోలీసులు. కాగా, ఓ బీజేపీ నేత కుమారుడు నిన్న రాత్రి కొందరికి విందు ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో విందులో కొకైన్ తీసుకున్నట్టు గుర్తించారు. ఇక, హోటల్‌లో కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీంతో బీజేపీ కుమారుడితో సహా మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం వారు ముగ్గురు గచ్చిబౌలి పోలీసు స్టేషన్‌లో ఉన్నారు.

# సిరీస్ మనదే..

## ఇంగ్లండ్‌పై టీమిండియా 5 వికెట్ల తేడాతో ఘన విజయం

### టీమిండియా సిరీస్‌లో 3-1తో ముందంజ



రాంచీ టెస్టులో ఇంగ్లండ్‌పై టీమిండియా 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. సోమవారం 192 పరుగుల లక్ష్యాన్ని 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ని కూడా కైవసం చేసుకున్న టీమిండియా సిరీస్‌లో 3-1తో ముందంజలో ఉంది. టామ్ హార్ట్లీ వేసిన బంతికి ధృవ్ జురెల్ రెండు పరుగులు చేసి టీమ్ ఇండియాకు విజయాన్ని అందించాడు. కెప్టెన్ రోహిత్ శర్మ (55), శుభ్‌మన్ గిల్ (52) రెండో ఇన్నింగ్స్‌లో అర్ధ సెంచరీలతో రాణించారు. 40/0 స్కోరుతో నాలుగో రోజు టీమ్ ఇండియా తన రెండో ఇన్నింగ్స్ కొనసాగించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ధృవ్ జురెల్ దక్కింది.

**కీలక పాత్ర పోషించిన రోహిత్, గిల్, జురేల్..**

భారత్ విజయంలో కెప్టెన్ రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ కీలక పాత్ర పోషించారు. వీరిద్దరూ రెండో ఇన్నింగ్స్‌లో అర్ధ సెంచరీలు సాధించారు. గిల్ 52 పరుగులతో నాటౌట్‌గా వెనుదిరిగాడు. అతనితో పాటు, ధృవ్ జురెల్ కూడా కష్ట సమయాల్లో 39 పరుగుల ముఖ్యమైన ఇన్నింగ్స్ ఆడాడు. అతను కూడా అజేయంగా వెనుదిరిగాడు. దీంతో వరుసగా మూడు టెస్టుల్లో విజయం సాధించిన రోహిత్ సేన.. మ్యాచ్‌ను మాత్రమే కాకుండా.. 3-1 తేడాతో గెలుచుకుంది. కాగా, నాలుగో రోజు భారత్ నిన్నటి స్కోరు 40/0తో ఇన్నింగ్స్ ప్రారంభించింది. 84 పరుగుల వద్ద భారత్ తొలి వికెట్ పడింది. జో రూట్ బౌలింగ్‌లో యశస్వి జైస్వాల్ అందించిన క్యాచ్‌ను జేమ్స్ అండర్సన్ అద్భుతంగా పట్టాడు. 37 పరుగుల వద్ద యశస్వి ఔటయ్యాడు. ఆ తర్వాత రోహిత్ శర్మ కూడా 17వ అర్ధ సెంచరీ నమోదు చేసి ఔట్ కాగా.. అతని వికెట్ టోర్స్ హార్ట్లీ చేతికి చిక్కింది. రోహిత్ 55 పరుగులు చేసి, పెవిలియన్ చేరాడు. రజత్ పాటిదార్ మళ్లీ విఫలమై ఖాతా కూడా తెరవలేకపోయాడు. అనంతరం లంచ్ తర్వాత భారత్‌కు వరుసగా రెండు బంతుల్లో రెండు ఎదురుదెబ్బలు తగిలాయి. షోయబ్ బషీర్ మొదట రవీంద్ర జడేజాను అవుట్ చేసి, తర్వాతి బంతికే సర్ఫరాజ్ ఖాన్‌ను అవుట్ చేశాడు. 4 పరుగుల వద్ద జడేజా ఔటయ్యాడు. అదే సమయంలో సర్ఫరాజ్ ఖాతా కూడా తెరవలేదు. అనంతరం ధృవ్ జురెల్, శుభ్‌మన్ గిల్ అద్భుతమైన భాగస్వామ్యంతో టీమిండియా మ్యాచ్‌ను తనవైపునకు తిప్పకుంది. దీంతో భారత్ ఐదు వికెట్ల తేడాతో గెలుచుకుంది.

**మూడో రోజు మారిన సీన్..**


అంతకుముందు మూడో రోజు మూడో సెషన్‌లో ఇంగ్లిష్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 145 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 46 పరుగుల ఆధిక్యంతో భారత్‌కు 192 పరుగుల లక్ష్యాన్ని అందుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ జట్టు 353 పరుగులకు ఆలౌట్ కాగా, భారత జట్టు 307 పరుగులకు ఆలౌటైంది.

## అదొక అద్భుతంగా ఫీలవుతా

### - శోభిత ధూళిపాళ

తెలుగు అమ్మాయి 'శోభిత ధూళిపాళ' చాలా డిఫరెంట్ గా సినిమాలు చేస్తూ వస్తోంది. ముఖ్యంగా కొన్ని బోల్డ్ పాత్రలను కూడా చాలా బాగా పోషించింది. ఈ క్రమంలోనే ఆమెకు బాలీవుడ్ లో కూడా గుర్తింపు వచ్చింది. ఐతే, తాజాగా శోభిత ధూళిపాళ 'అమ్మ అని పిలిపించుకోవడం అద్భుతమైన ఫీలింగ్' అంటూ చెప్పుకొచ్చింది. ఇంకా శోభిత ధూళిపాళ ఏం మాట్లాడింది అంటే.. 'తన జీవితానికి అసలైన అర్థం మాతృత్వాన్ని పొందినప్పుడే అని, తాను అమ్మ అని పిలిపించుకోవడం కోసం ఎదురుచూస్తున్నానని ఆమె చెప్పారు. 'నిజంగా ఆ అనుభూతిని ఎప్పుడు పొందుతానో కానీ, అదొక అద్భుతంగా ఫీలవుతా. అమ్మ అని పిలిపించుకోవడం ఎంత బాగుంటుందో' అని శోభిత ధూళిపాళ ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు.





## పాకిస్తాన్ కు రావి నది నీళ్లను ఆపేసిన భారత్

పాకిస్థాన్‌కు భారత్ భారీ షాక్ ఇచ్చింది. షాపూర్ కంది బ్యారేజ్ నిర్మాణం తుదిదశకు చేరుకోవడంతో పాకిస్థాన్‌కు వెళ్తున్న రావి నది నీటి ప్రవాహాన్ని నిలిపేసినట్లు తెలుస్తోంది. రావి నది ద్వారా పాకిస్థాన్‌లోకి ప్రవేశించే 1150 క్యూసెక్కుల నీటిని ఇప్పుడు జమ్మూకశ్మీర్‌లోని కథువా, సాంబా జిల్లాల్లోని 32,000 హెక్టార్ల భూమికి సాగు నీరుగా ఇవ్వనున్నారు. కాగా.. ఇటీవలే 'చీనాబ్' నీటిని కూడా భారత్ సమర్థవంతంగా వినియోగించాలని నిర్ణయించుకుంది.

## ఘోర రోడ్డు ప్రమాదం.. నలుగురు మృతి

జిల్లాలోని ప్రత్తిపాడు వద్ద ఘోర రోడ్డు ప్రమాద ఘటన చోటుచేసుకుంది. రోడ్డుపై ఉన్న వారిని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో నలుగురు మృతి చెందారు. ఇక, మృతులను బాపట్ల జిల్లాలకు చెందిన వారిగా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. ప్రత్తిపాడు మండలంలోని పాదాలమ్మ గుడి వద్ద 16వ నెంబర్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాద ఘటన చోటు చేసుకుంది. కాగా, లారీ పంక్చర్ కావడంతో నలుగురు వ్యక్తులు టైర్ మారుస్తున్నారు.


## సుప్రీంకోర్టులో పరువునష్టం కేసులో కేజ్రీవాల్‌కు సమన్లపై విచారణ

ఒక పరువు నష్టం కేసులో తనకు జారీ అయిన సమన్లను ఢిల్లీ హైకోర్టు సమర్థించడాన్ని సవాల్ చేస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్ మీద సుప్రీంకోర్టులో నేడు (సోమవారం) విచారణ జరుగనుంది. యూట్యూబర్ ధ్రువ్ రాఠీ 2018 మే నెలలో రూపొందించినట్లు చెబుతున్న ఒక వీడియోను కేజ్రీవాల్ తిరిగి ట్వీట్ చేసినందుకు క్రిమినల్ కేసు నమోదు అయింది. అయితే, ఒకరిని కించపరిచేలా ఉన్న వీడియోను ఇతరులకు పంపడం కూడా పరువునష్టం చట్టం కింద నేరమే అవుతుంది.. అలాంటి విషయాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఢిల్లీ హైకోర్టు ఇప్పటికే క్లారిటీ ఇచ్చింది. దీంతో ట్రయల్ కోర్టు సమన్లను కొట్టివేయడానికి ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. ఇక, దీనిపై సీఎం అరవింద్ కేజ్రీవాల్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

## ఈడీ విచారణకు కేజ్రీవాల్ డుమ్మా..

ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్, సీఎం అరవింద్ కేజ్రీవాల్ మరోసారి ఈడీ విచారణకు డుమ్మా కొట్టారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించిన కేసులో కేజ్రీవాల్ నేడు విచారణకు హాజరు కావాలని ఈడీ నోటీసులు పంపించినా ఏడుసారి కూడా ఆయన హాజరుకాలేదు. వివరాల ప్రకారం.. లిక్కర్ పాలసీ కేసులో ఈడీ ఏడోసారి జారీ చేసిన సమన్లను కూడా కేజ్రీవాల్ పట్టించుకోలేదు. నేడు విచారణకు కేజ్రీవాల్ హాజరు కాలేదు. ఈ మేరకు ఆమ్ ఆద్మీ పార్టీ స్పందిస్తూ..'ప్రస్తుతం ఈ అంశం కోర్టు పరిధిలో ఉందని గుర్తు చేసింది. ఈడీ చట్టపరమైన ప్రక్రియను గౌరవించాలని సూచించింది. కేజ్రీవాల్‌కు పదేపదే సమన్లు జారీ చేసే బదులు కోర్టు నిర్ణయం కోసం వేచి ఉండాలని కోరింది. ముఖ్యమంత్రికి పలుమార్లు సమన్లు పంపడం సరికాదని వ్యాఖ్యానించింది. తదుపరి విచారణ మార్చి 16న జరగనుంది. రోజువారీ సమన్లు పంపే బదులు ఈడీ ఓపిక పట్టాలి. కోర్టు నిర్ణయం కోసం వేచి ఉండాలి. మేం ఇండియా కూటమిని విడిచిపెట్టే ప్రసక్తి లేదు. మోదీ ప్రభుత్వం ఇలాంటి ఒత్తిడి చేయకూడదు' అని పేర్కొంది. ఇదిలా ఉండగా.. ఈడీ ఇప్పటి వరకు ఏడుసార్లు కేజ్రీవాల్‌కు సమన్లు పంపించింది. ఇటీవల ఫిబ్రవరి 22వ తేదీన, గతంలో నవంబర్ 2న, డిసెంబర్ 21న, ఆ తర్వాత జనవరి 3న కేజ్రీవాల్‌కు ఈడీ అధికారులు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ తర్వాత జనవరి 13వ తేదీన కూడా నాలుగోసారి విచారణకు హాజరు కావాలని నోటీసులు పంపింది. కానీ, నాలుగు సార్లూ ఈడీ నోటీసుల్ని కేజ్రీవాల్ పట్టించుకోలేదు. దీంతో జనవరి 31, ఫిబ్రవరి 14వ తేదీన కూడా ఈడీ నోటీసులు పంపింది. అయితే, అప్పుడు కూడా ఆయన విచారణకు హాజరు కాలేదు. పైగా ఈడీ నోటీసులు అక్రమమంటూ కొట్టిపారేశారు.





## సింహాలకు అక్బర్, సీత పేర్లు..
# ఆ అధికారిపై వేటు

పశ్చిమ బెంగాల్‌లోని శిలిగుడి సఫారీ పార్కులో అక్బర్, సీత పేర్లు కలిగిన మగ, ఆడ సింహాలను ఒకే ఎన్‌క్లోజర్‌లో ఉంచడం ఇటీవల తీవ్ర వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. వాటికి ఆ పేర్లు పెట్టడంపై కలకత్తా హైకోర్టు కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది కాస్తా దుమారం రేపడంతో త్రిపుర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగింది. రాష్ట్ర అటవీ వ్యవహారాల ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ప్రబిన్ లాల్ అగర్వాల్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. జంతువుల మార్పిడి కార్యక్రమం కింద బెంగాల్ అధికారులు ఫిబ్రవరి 12న త్రిపురలోని సిపాహీజలా జూ పార్క్ నుంచి రెండు సింహాలను శిలిగుడి సఫారీ పార్కుకు తీసుకొచ్చారు. 'అక్బర్', 'సీత' పేర్లు కలిగిన ఆ మగ, ఆడ సింహాలను ఒకే ఎన్‌క్లోజర్‌లో ఉంచారు. దీనిపై విశ్వహిందూ పరిషత్ కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది. రాష్ట్ర అటవీశాఖ అధికారులే వాటికి ఆ పేర్లు పెట్టారని.. అవి హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపించింది. వెంటనే ఆడ సింహం పేరు మార్చాలని డిమాండ్ చేసింది. దీనిపై ఇటీవల విచారణ జరిపిన న్యాయస్థానం.. సింహాలకు ఆ పేర్లు పెట్టడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. అనవసర వివాదాలు ఎందుకు సృష్టిస్తారని ప్రశ్నించింది. వెంటనే వాటికి వేరే పేర్లు పెట్టాలని ఆదేశించింది. దీనిపై బెంగాల్ ప్రభుత్వం స్పందిస్తూ.. త్రిపుర నుంచి తీసుకొచ్చేటప్పటికే వాటికి ఆ పేర్లు ఉన్నాయని, వాటిని మారుస్తామని కోర్టుకు తెలిపింది. ఈ వ్యవహారం వివాదాస్పదమవడంతో త్రిపుర ప్రభుత్వం చర్యలకు దిగింది. రాష్ట్ర వైల్డ్‌లైఫ్ చీఫ్‌గా ఉన్న అగర్వాల్‌ను వివరణ కోరగా.. తాను ఆ పేర్లు పెట్టలేదని చెప్పారు. అనంతరం దర్యాప్తు చేపట్టగా.. బెంగాల్‌కు అప్పగించే సమయంలో డిస్పాచ్ రిజిస్టర్‌లో ఆయనే ఆ సింహాల పేర్లను అక్బర్, సీతగా నమోదు చేసినట్లు తెలిసింది. దీంతో అగర్వాల్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు.



## మసాలాలతో క్యాన్సర్‌కు మందు!

క్యాన్సర్‌కు చికిత్స కోసం భారతీయ మసాలా దినుసులను ఉపయోగించడానికి మద్రాస్ ఐఐటీ పరిశోధకులు కసరత్తు చేస్తున్నారు. ఈ అంశంపై పేటెంట్ కూడా పొందారు. వీటితో తయారైన మందులు 2028 నుంచి మార్కెట్లో అందుబాటులోకి వస్తాయని వారు తెలిపారు. భారతీయ మసాలాలతో రూపొందిన నానో ఔషధాలకు క్యాన్సర్‌పై పోరాడే సామర్థ్యముందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఊపిరితిత్తులు, రొమ్ము, పేగు, గర్భాశయ ముఖద్వారం, గొంతు వంటి భాగాల్లో ఉత్పన్నమయ్యే క్యాన్సర్లపై ఇది ప్రభావం చూపుతుందని వివరించారు. ఆరోగ్యకర కణాల జోలికి అది వెళ్లదని తెలిపారు. ధర వంటి అంశాలపై పరిశోధకులు కసరత్తు చేస్తున్నారు. జంతువులపై జరిగిన ప్రయోగాలు విజయవంతమయ్యాయి. మానవులపై దీని సామర్థ్యాన్ని పరీక్షించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. "భారతీయ మసాలాల నుంచి సేకరించిన నూనెలతో ఒనగూరే ప్రయోజనాల గురించి శతాబ్దాలుగా నిపుణులకు అవగాహన ఉంది. వాటిలోని క్రియాశీల పదార్థాన్ని శరీరంలోని లక్షిత ప్రాంతానికి చేరవేసే అంశంలో ఉన్న పరిమితుల వల్ల అవి ఔషధాలుగా అందుబాటులోకి రావడంలేదు. 'నానో ఎమల్షన్' వల్ల ఈ పరిమితిని సమర్థంగా అధిగమించొచ్చు. ఈ ఎమల్షన్ స్థిరత్వం చాలా ముఖ్యం. దాన్ని మా ల్యాబ్‌లో మెరుగుపరిచాం" అని ఐఐటీ మద్రాస్‌లోని రసాయన ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఆర్.నాగరాజన్ తెలిపారు. సంప్రదాయ క్యాన్సర్ చికిత్సతో పోలిస్తే నానో ఔషధాలతో అనేక ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు.



## జైశ్రీరాం అనకపోతే చంపేస్తామంటున్నారు

ప్రధాని మోదీ తిరుపతి సాక్షిగా స్పెషల్ స్టేటస్ ఇస్తామన్నారని.. కానీ ఆ మాట మర్చిపోయారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో మతతత్వం పెంచుతున్నారని.. జై శ్రీరాం అనకపోతే చంపేస్తాం అని అంటున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. మోదీ పాలనలో ఇతర మతాల ప్రజలకు భద్రత లేదన్నారు. పాస్టర్‌లకు ఆత్మ రక్షణ కోసం రైఫిల్ కొనేసి ఇస్తానని తెలిపారు. కేసీఆర్ చిత్తుగా ఓడిపోతారని చెప్పానని... అదే జరిగిందన్నారు. మోదీ తొత్తులు అయిన టీడీపీ, జనసేన పార్టీలను నమ్మవద్దన్నారు. ప్రజాశాంతి పార్టీలో చేరితే పవన్‌ను సీఎంను చేస్తానని అన్నారు.

# రేపు తెలంగాణకు ప్రియాంక గాంధీ
## చేవెళ్ల గడ్డపై రెండు పథకాలు అమలు



తెలంగాణ రాష్ట్రానికి రేపు (27వ) తేదీన కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ రానున్నారు. రేపు చేవెళ్లలో జరిగే ప్రియాంక గాంధీ సభను విజయవంతం చేయాలని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రియాంక గాంధీ చేతుల మీదుగా చేవెళ్ల గడ్డ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెండు పథకాలను ప్రారంభిస్తారని తెలిపారు. రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షల వైద్యసేవలు వంటి పథకాలు పేదల జీవితాల్లో ఆర్థికంగా ఊరటనిస్తాయని తెలిపారు. ఈ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రియాంక గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి మన జిల్లాకు వస్తున్నందున ఈ సభను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేయాలని కోరారు. ఈ పథకాలు ఎక్కువగా మహిళలకు సంబంధించినవని, ఈ సభకు మహిళలు పెద్దఎత్తున తరలిరావాలని సూచించారు. ఎన్నికల్లో బీజేపీతో కలిసి పోటీ చేస్తామని, ఎన్నికల తర్వాత మన జిల్లాలో బీఆర్ ఎస్ కు అడ్రస్ ఉండదన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరాలని పిలుపునిచ్చారు. అనంతరం సభ జరిగిన మైదానాన్ని ప్రియాంక గాంధీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ భీమ్ భరత్, సేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, మహేశ్వరం, రాజేంద్రనగర్ ఇన్‌చార్జిలు, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. చేవెళ్లకు ప్రియాంక గాంధీ రానున్న సందర్భంగా.. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తావులేకుండా ఏర్పాటు చేస్తున్నారు అధికారులు. ప్రియాంక గాంధీ చేవెళ్ల రానున్న సందర్భంగా.. ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని అధికారులు వెల్లడించారు.. ప్రజలు సహకరించాలని తెలిపారు.



# అందాల తుఫాను..
# నేహా శెట్టి

చిన్నప్పటి నుంచి సినిమాల్లో నటించాలన్న ఆసక్తి ఉండేది. కానీ సినిమా ఇండస్ట్రీకీ, మా కుటుంబానికీ సంబంధమే లేదు. మా అమ్మ డెంటిస్ట్. నాన్న బిజినెస్‌మ్యాన్. స్కూల్ డేస్‌లో డ్యాన్స్ అంటే ఆసక్తి ఉండేది. స్కూల్ డ్రామాల్లో తప్పకుండా పాల్గొనేదాన్ని. తరచూ సినిమాలు చూసేదాన్ని. హీరోయిన్లు వేసుకున్నట్టుగా దుస్తులు ధరించేదాన్ని. సినిమాలో హీరోయిన్లు వేసిన డ్రెస్ మళ్లీ వేసుకోరు కదా.. నేనూ అలాగే ఒకసారి ధరించిన డ్రెస్ మళ్లీ వేసుకోనని మారాం చేసేదాన్ని. ఇలా సినిమాల ప్రభావం నామీద చాలానే ఉంది.



## కేసీఆర్‌పై కోపంతోనే కాంగ్రెస్‌కు
## ఓటేసిన తెలంగాణ ప్రజలు

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కోపంతో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారని బీజేపీ నేత ఈటల రాజేందర్ అన్నారు. లోకసభ ఎన్నికల్లో మాత్రం బీజేపీకే ఓటేస్తామని ప్రజలు చెబుతున్నారని పేర్కొన్నారు. గజ్వేల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. "మహిళల ఆత్మగౌరవం నిలబెట్టిన ఘనత కేంద్ర ప్రభుత్వానిదే. 10 లక్షల మంది మహిళలకు వడ్డీలేని రుణాలు ఇస్తున్నాం. మహిళలు, యువత అంతా కలిసి మోదీని మరోసారి గెలిపించుకోవాలనుకుంటున్నారు. గతంలో కాంగ్రెస్ పాలనలో ఎక్కడ చూసినా కుంభకోణాలే. మోదీ నాయకత్వంలో ఎలాంటి మచ్చ లేకుండా భాజపా ప్రభుత్వం కొనసాగుతోంది" అని ఈటల అన్నారు.



## తిరుమలలో కొనసాగుతున్న
# భక్తుల రద్దీ

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శ్రీవారి దర్శనానికి 22 కంపార్టుమెంట్లో భక్తులు వేచి ఉన్నారు. సర్వ దర్శనానికి 10 గంటలు సమయం పడుతోంది. నిన్న శ్రీవారిని 76,577 మంది భక్తులు దర్శించుకోగా, 23,656 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. నిన్న శ్రీవారి హుండీ ఆదాయం 5.09 కోట్లు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



## ఇండోనేషియాలో
# భూకంపం

ఇండోనేషియాను ఆదివారం రాత్రి భూకంపం వణికించింది. ప్రధాన ద్వీపం జావాతో పాటు రాజధాని జకర్తాలో భూమి కంపించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 5.6గా నమోదు అయినట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే పేర్కొంది. పశ్చిమ జావా ప్రావిన్స్ పెలబుహన్‌రాటు పట్టణానికి 80 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు తెలిపింది. అయితే భూకంపం వల్ల ప్రాణ, ఆస్తి నష్టం సంభవించినట్లు సమాచారం లేదు.



## నాగబాబు సీటు చేంజ్..
# అక్కడి నుంచే పోటీ

టీడీపీ-జనసేన తొలి ఉమ్మడి జాబితా వెల్లడి కావడంతో రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. జనసేన పోటీ చేసే మూడు లోక్‌సభ స్థానాల్లో అనకాపల్లి కూడా ఉంది. దీనిపై ఆశలు పెట్టుకున్న పారిశ్రామిక వేత్త బైరా దిలీప్ చక్రవర్తి ఇప్పుడు చోడవరంపై దృష్టి సారిస్తున్నట్లు తెలిసింది. పవన్ కళ్యాణ్ సోదరుడు నాగబాబు అనకాపల్లి నుంచి పోటీ చేయనున్నట్లు సమాచారం.



## ఎంపీ అభ్యర్థిగా
# ఆళ్ల రామకృష్ణారెడ్డి

గుంటూరు పార్లమెంట్ వైసీపీ రాజకీయాలు కీలక మలుపులు తిరుగుతున్నాయి. వైసీపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తిరిగి సొంత గూటికి చేరిన విషయం తెలిసిందే. దాంతో గుంటూరు రాజకీయాల్లో కొత్త మలుపు రూపు దిద్దుకుంది. ఆళ్లను గుంటూరు పార్లమెంట్‌కు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేయించేందుకు సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.